క్లుప్తంగా

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు తక్షణమే ఇళ్ల హక్కు పట్టాలు ఇవ్వాలని కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం ఆయన అశ్వారావుపేటలో పలు చోట్ల ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి అవాసాల వద్దకు వెళ్లి వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు, కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేసానన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌డి.సలీం, గన్నిన రామకృష్ణ, నరాటి ప్రసాద్, వగ్గెల అర్జున్‌రావు, వెంకట్, పఠాన్ జలాల్, జాకీర్, విజయ్‌కాంత్, చీపూర్ల సత్యవతి పాల్గొన్నారు.

రూ.5 వేలు ఇవ్వాలి

మణుగూరురూరల్: సింగరేణి సంస్థలో పని చేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు, ఓబీ వర్కర్లకు ప్రత్యేక ప్రోత్సాహక బోనస్ రూ.5వేలను ఇవ్వాలని ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు ఏ.మంగీలాల్ సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఏరియాలోని దుర్గా ఇన్‌ఫ్రా ఓబీ కంపెనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఓబి వర్కర్లు జి.శ్రీధర్, శేఖర్, సతీష్, నాగరాజు, కార్తీక్, ప్రవీణ్, కె రాజు, రమణ, శ్రీనివాస్‌రెడ్డి, పవన్, సాజుద్దీన్ పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న దృశ్యం

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీలో మన ఊరు–మన బాధ్యత నినాదంతో స్థానిక యువకులు శ్రమదానం చేశారు. రామాలయం వీధిలో ఆదివారం పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు పిచ్చిమొక్కలను, ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించారు. గ్రామపెద్దలు కేతినేని వెంకటేశ్వర్లు, లేళ్ల భాస్కర్, రామానుజవరం మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, సాధిని సీతయ్య, తమ్మిశెట్టి సాంబశివరావు, నోముల రవి, బొల్లం చిన్నమదర్, కేతినేని రాజేష్, గుండగాని లక్ష్మణ్, నోముల రాములు, లేళ్ల అప్పారావు, పిట్టల కళ్యాణ్, పోతనబోయిన శేషగిరి, బొల్లం రాజేష్, గంగరబోయిన సతీష్, ముద్దెరబోయిన ఐలేష్, కర్ని వెంకటేష్, పోతనబోయిన నవీన్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మణుగూరురూరల్: ఈ నెల 20వ తేదీన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే విలీన సభను జయప్రదం చేయాలని ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూధన్‌రెడ్డి స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగానే 20న టీయూసీఐలో ఇఫ్టూ విలీన సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. నాయకులు బి.మల్సూర్, బత్తుల వెంకటేశ్వర్లు, జె.యాకయ్య, వి.జానయ్య, ఎం.రాజేందర్, ఆర్.బిక్షం, ఆర్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అశ్వారావుపేటరూరల్: స్థానిక సీనియర్ నాయకుడు ఆలపాటి రామును ఆదివారం మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధ పడుతూ, ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

గోండ్వానా సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు..

చర్ల: మండలంలోని గన్నవరంలో బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా తాలిపేరువాగులో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందిన యువకుల కుటుంబాలను ఆదివారం గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ యువకుల మృతికి ప్రధాన కారణం రెవెన్యూ పంచాయతీ శాఖల అధికారుల వైఫల్యమేనన్నారు.

బహుమతుల పంపిణీ

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని గౌఢ బజారులో బతుకమ్మలను అలంకరించిన మహిళలకు యువ నాయకుడు మోర్ల వెంకన్న గౌడ్ తన సొంత ఖర్చులతో బహుమతులను పంపిణీ చేశారు. శనివారం విజయదశమి సందర్భంగా వాటిని అందజేశారు.

ఘనంగా విజయదశమి వేడుకలు



మణుగూరుటౌన్: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

దసరా పర్వదినాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. పెద్దలు, పిల్లలు వేకువ జామునే నిద్ర లేచి తలంటు స్నానాలు చేశారు. ఇళ్లల్లో అమ్మవారికి పిండి వంటలను నైవేద్యాలుగా సమర్పించి, కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాలు, దసరా మండపాల్లో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం వేళ శాస్త్రోక్తంగా శమీ పూజ నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై జమ్మి వృక్షానికి పూజలు చేశారు. రాత్రివేళ నరకాసుర వధ చేశారు. పలు ఆలయాల్లో పూజాక్రతువులు నిర్వహించారు. పోలీసులు ఆయుధ పూజల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వాపురం: మల్లెలమడుగులో జమ్మి పూజ చేస్తున్న గ్రామస్తులు



మణుగూరుటౌన్: పీవీకాలనీలో రామ్‌లీలా కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అధికారులు



దమ్మపేట: గాయత్రి ఆశ్రమంలో భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



చంద్రుగొండ: పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ స్వప్న ఆధ్వర్యంలో ఆయుధపూజ చేస్తున్న పోలీసులు



కరకగూడెం: అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ



మణుగూరుటౌన్: ఆయుధ పూజ నిర్వహిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు



ములకలపల్లి: భక్త అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద జమ్మి చెట్టుకు పూజలు..



అశ్వారావుపేటరూరల్: దుర్గామాత విగ్రహం ఊరేగింపులో కోలాటం..



అశ్వారావుపేటరూరల్: పోలీసుల ఆయుధ పూజ



బూర్గంపాడు: సారపాకలో అమ్మవారికి పూజలు



మణుగూరుటౌన్: అమ్మవారిని వీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు



మణుగూరుటౌన్: భద్రాద్రి స్టేడియంలో అలరించిన నృత్య ప్రదర్శన



ములకలపల్లి: దుర్గామాతను ఊరేగిస్తున్న దృశ్యం

పేలవంగా రైతు సదస్సు

అశ్వారావుపేట: దసరా పర్వదినాన అశ్వారావుపేట ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీలో పవర్‌ప్లాంట్ ఏర్పాటు సందర్భంగా అట్టహాసంగా ఏర్పాటు చేసిన రైతుల సదస్సు, శాస్త్రవేత్తల సలహాలు, స్టాల్‌ల ఏర్పాటు పేలవంగా నడిచింది. కార్పొరేట్ రైతులుగా చెప్పబడే ఆయిల్‌ఫాం రైతులు దసరా రోజు వస్తారనుకుని ఆయిల్‌ఫెడ్ అధికారులు, వ్యవసాయ శాఖ పెద్దాయన అత్యుత్సాహం ఫలించలేదు. సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభం అవుతుందని ప్రకటించినా.. 12 గంటల వరకూ రైతులు సభాస్థలికి చేరుకోలేదు. దీంతో బొలెరో వాహనాల గుండా సమావేశ కూలీలను తరలించినట్లు సమాచారం. ఉన్న అరకొర రైతులు వెళ్లిపోకుండా వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు ఉపన్యాసాలు చేశారు. కొందరు రైతులు అడిగిన సందేహాలకు పూర్తిగా సమాధానం చెప్పకుండా దాటవేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వచ్చి వేదిక మీద కూర్చున్నా.. రైతులు రాకపోవడంతో ఆయన ఆగ్రహావేశాలకు గురయ్యారు. దీంతో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సైతం ప్రేక్షక పాత్ర పోషించాల్సి వచ్చింది. ఎమ్మెల్యే జారే.. మంత్రి తుమ్మల వర్గీయుల మధ్య విభేదాలు కార్యక్రమ వేదికగా బట్టబయలైంది.

అన్నం వడ్డింపు ఆలస్యం..



ఫుడ్ స్టాల్ వద్ద వాగ్వాదానికి దిగిన రైతులు, అడ్డుకుంటున్న పోలీసులు

దేశానికి అన్నం పెట్టే అన్నదాతల కోసం ఏర్పాటు చేసిన సమావేశం అది. కానీ మధ్యాహ్నం 2 దాటినా భోజనం పెట్టకపోడంతో షుగర్ బీపీ ఉన్న రైతులు.. దూర ప్రాంతం నుంచి వచ్చిన రెండు రాష్ట్రాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఫుట్ స్టాల్ వద్ద రైతులు, పోలీసులకు మధ్య కొంత ఘర్షన వాతావరణ నెలకొంది. చాలా మంది రైతులు, పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఆహారం అందక ఆకలితో వెనుతిరిగారు. దసరా పండుగ కావడంతో 4 కిలోమీటర్ల దూరంలోని అశ్వారావుపేట కేంద్రానికి వెళ్లినా హోటళ్లు లేక నానా అవస్థలు పడ్డారు.

చీరలు పంపిణీ

అశ్వారావుపేటరూరల్: దసరా పండుగ సందర్భంగా కొండరెడ్ల మహిళలకు ఆదివారం ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. మండలంలోని రెడ్డిగూడెం, సుద్దగోతులగూడెం గ్రామాలకు చెందిన 50 మంది మహిళలకు బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మనవరాలు హేమశ్రీ, మనవడు జతిన్ చేతుల మీదుగా అందజేశారు. మాజీ సర్పంచ్ మహేశ్వరరెడ్డి, నాయకులు ధర్మారావు, చిట్టెమ్మ, రత్నారెడ్డి పాల్గొన్నారు.

జాకెట్ పీసులు..

భద్రాచలంటౌన్: పట్టణంలోని ఏఎంసీ కాలనీలోని మహిళలకు మలమహానాడు ఆధ్వర్యంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం జాకెట్ పీసులను పంపిణీ చేశారు. మంజువాణి, మేరి, అరుణ, రూతమ్మ, సత్యవతి, భవాని, జయమ్మ, సుబ్బు, భవాని, సుజాత, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి గ్రామంలో సీఎం రిలీఫ్ పండ్ చెక్కులు, ఎల్‌ఓసీ పత్రములను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం బాధితులకు అందజేశారు. నాగుపల్లి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే జారే ముందుగా గ్రామ పెద్దలను కలసి, వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. పక్షవాతంతో బాధపడుతున్న గ్రామస్తుడు అంగోతు రాంబాబును పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు పరామర్శ..

ములకలపల్లి: ములకలపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారి బిక్కుమళ్ల సుధాకర్‌ను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరామర్శించారు. సుధాకర్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవలే స్టంట్ వేయించుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, గాడి తిరుపతిరెడ్డి, బిక్కుమళ్ళ భాస్కర్, వేణు, శనగపాటి రవి, పీఏసీఎస్ సీఈఓ కుంచారపు శ్రీనివాసరావు ఉన్నారు.



నాగుపల్లిలో ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, గోత్రనామార్చనలు, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను జరిపించారు. అనంతరం స్వామి వారి కల్యాణాన్ని మేళతాళాల మధ్య ఆలయ అర్చకుడు ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిపించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామి వారి కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.మండల వ్యాప్తంగా దసరా వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.మండల కేంద్రంలోని భవానీనగర్‌లో కొలువుదీరిన అమ్మ వారి మండపం వద్ద ఏర్పాటు చేసిన మహాఅన్నదాన కార్యక్రమాన్ని శివాలయ పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు ప్రారంభించారు. బాలాజీ ఆలయ మాజీ చైర్మన్ వనమా గాంధీ, జంగాల శ్రీనివాసరావు, బాణావత్ భీముడు, చల్లాపల్లి వెంకటేశ్వర్లు, చల్లా రమేష్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



దమ్మపేట: జెడ్పీహెచ్‌ఎస్‌లో 2008-09 విద్యార్థులు, ఉపాధ్యాయులు



మణుగూరురూరల్: ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2014–15 విద్యాసంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనమయ్యారు. పూర్వ విద్యార్థులంతా పదేళ్ల తర్వాత ఒకచోట చేరి ఆనాటి మధుర స్మృతులను, జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. విద్యార్థి దశలో వారు చేసిన అల్లర్లను గుర్తు తెచ్చుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం ఆటపాటలతో సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరామశర్మ, డోలి శ్రీనివాస్, రామిరెడ్డి, ఎం.భద్రు, బి.భద్రు, విజయ్, రమేష్, కిషన్, పూర్వపు విద్యార్థులు సాంబశివరావు, పవన్ కల్యాణ్, ప్రియాంక, బిందు, రేణుశ్రీ, బాబా తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వపు విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంను ఘనంగా నిర్వహించుకున్నారు. దమ్మపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో 2008–2009 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు, అలనాటి ఉపాధ్యాయులు ఆత్మీయంగా కలుసుకున్నారు. ఒకరికొకరు బాగోగులను తెలుసుకుని పాత జ్ఞాపకాలు, మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి, కలసి విందు భోజనం చేశారు. అనాటి హెచ్‌ఎం నిర్మల, ఉపాధ్యాయులు బుచ్చయ్య, మస్తాన్ వలీ, చెన్నకేశవ రెడ్డి, సురేష్, ఉషాశ్రీ, నీరజా, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీలో గ్రామీణుల ప్రతిభ

- సత్తాచాటిన నిరుపేద అభ్యర్థులు
- తాపీ కార్మికుడికి సైతం సర్కార్ ఉద్యోగం
- అశ్వారావుపేట వాసులకు పెద్ద సంఖ్యలో కొలువులు



ఎస్జీటీగా నియామక పత్రాలను అందుకున్న అక్కా చెల్లి కావ్య, కవిత





ఇంటి వద్ద వరల తయారీ పనిలో తన్నీరు వేణు, (ఇన్‌సెట్) నియామకపత్రంతో..



గృహిణి అచ్చె శృతి



కంప్యూటర్ ఆపరేటర్ చాంద్‌పాషా



రైతుబిడ్డ రొయ్యల గణేష్



రైతు కుమార్తె లకావత్ దివ్య

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటి అశ్వారావుపేట మండలంలోని గ్రామీణ వాసులు సర్కారు కొలువులు సాధించారు. ఈ ఫలితాల్లో అత్యధికంగా నిరుపేదలు, వ్యవసాయ రైతులు, కూలీలు, కార్మికులతోపాటు నిరుద్యోగులు ఉద్యోగాలు పొందారు. ఒక్క అశ్వారావుపేట మండలంలోనే దాదాపు 23 మందికి పైగా ఉపాధ్యాయ కొలువులు సాధించడం విశేషం. తాజాగా వీరంతా టీచర్ పోస్టుల నియామక పత్రాలను అందుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.

తాపీ కార్మికుడు ఎస్జీటీగా..

మండలంలోని గుమ్మడవల్లికు చెందిన తన్నీరు వేణు తల్లి శేషమ్మ గత కొంత కాలంగా పక్షవాతంతో మంచనాకే పరిమితం కాగా.. తండ్రి వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. దీంతో కుటుంబ పోషణ కోసం వేణు ఇంటి వద్దే తాపీ పనిలో భాగంగా వరలు, స్తంభాలు తయారు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏలాంటి కోచింగ్ లేకుండానే స్టడీ మెటీరియల్ తెచ్చుకొని.. పని చేస్తూనే ఖాళీ సమయంలో డీఎస్సీకు సిద్ధం అయ్యాడు. బీఈడీ పూర్తి చేసిన వేణు డీఎస్సీ పరీక్ష రాసి, తాజాగా ప్రకటించిన ఫలితాల్లో జిల్లా 210 ర్యాంకు సాధించగా బీసీ–ఏ కేటగిరిలో ఎస్జీటీ ఉద్యోగాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ మేరకు అధికారుల నుంచి నియామక పత్రాన్ని అందుకున్నాడు.

నిరుపేద కుటుంబం నుంచి..

మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన మహ్మద్ చాంద్‌పాషా ఓ గ్యాస్ కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తూనే డీఎస్సీకు సిద్ధమయ్యాడు. తండ్రి వ్యవసాయ కూలీ. తల్లి హోటల్‌లో పని చేస్తోంది. ఈ క్రమంలోనే ఇంటి వద్ద సొంతంగా డీఎస్సీకు సిద్ధం కాగా, డీఎస్సీ ఫలితాల్లో జిల్లా స్థాయిలో 398వ ర్యాంకు, బీసీ–ఈ కేటగిరిలో 5 ర్యాంకు సాధించి ఎస్జీటీ ఉద్యోగాన్ని సాధించాడు.

సాధారణ గృహిణికి సైతం..

మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన అచ్చె శృతి సాధారణ గృహిణి. కాగా, ఆమెకు ఇద్దరు చిన్నారులైన కుమార్తెలున్నారు. భర్త ఉప్పల దుర్గాప్రసాద్ ఆటో మొబైల్ షాపుతోపాటు ట్రాక్టర్ మెకానిక్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా, శృతి తాజాగా ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లా స్థాయిలో 330 ర్యాంక్ రాగా, బీసీ–బీ కేటగిరిలో 22వ ర్యాంక్ వచ్చింది. దీంతో ఆమె ఎస్జీటీకు ఎంపికయ్యారు.

ఆసుపాక నుంచి నలుగురు..

మండలంలోని ఆసుపాక గ్రామం నుంచి నలుగురు అభ్యర్థులు టీచర్ కొలువులు సాధించారు. గిరిజన గ్రామమైన ఆసుపాక నుంచి ఒకే సారి నలుగురు అభ్యర్థులు ఉద్యోగాలు పొందడం విశేషం. ఈ గ్రామానికి చెందిన సామాన్య రైతు బిడ్డ లకావత్ వెంకటేశ్వరరావు కుమార్తె లకావత్ దివ్యకు జనరల్‌లో 109వ ర్యాంక్ రాగా, ఎస్టీ కేటగిరిలో 17వ ర్యాంక్ సాధించింది. దీంతో ఆమె ఎస్జీటీ కొలువు సాధించింది. అలాగే ఇదే గ్రామానికి చెందిన ఎస్.గంగాధర్, తుర్సం రాణి ఎస్జీటీగా, మడకం రాముకు స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు సాధించారు. వీరంతా నిరుపేద కుటుంబాల వారే కావడం గమనార్హం.

పేద రైతు బిడ్డకు..

వినాయకపురం గ్రామానికి చెందిన రొయ్యల సత్యనారాయణ, కళావతి దంపతుల కుమారుడు రొయ్యల గణేష్ తొలిసారిగా డీఎస్సీ–2024 పరీక్షల్లో హాజరు కాగా, ఎస్జీటీ విభాగంలో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు దక్కించుకున్నాడు. తండ్రి సత్యనారాయణ వ్యవసాయం వృత్తి కాగా, తల్లి కళావతి గృహిణి, తమ్ముడు ముఖేష్ విద్యనభ్యసిస్తున్నాడు. ఎస్జీజీగా టీచర్ నియామక పత్రాన్ని అధికారుల నుంచి అందుకున్నాడు.

అక్కా, చెల్లి ఎస్జీటీలుగా..

డీఎస్సీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అక్కా, చెల్లికి సైతం సర్కారు కొలువులు వరించాయి. అశ్వారావుపేటలోని నందమూరి నగర్‌కు చెందిన గారపాటి వెంకట నారాయణ కుమార్తెలు గారపాటి కావ్య, గారపాటి కవిత సొంత అక్కా చెల్లెలు. నిరుపేద కుటుంబానికి చెందిన వీరు ఇంట్లోనే సొంతంగా డీఎస్సీకు సిద్ధమై పరీక్షలు రాయగా కావ్యకు జిల్లా స్థాయిలో 102 ర్యాంక్ రాగా తమ కేటగిరిలో 4 ర్యాంక్, అలాగే కవితకు జిల్లా స్థాయిలో 186 ర్యాంక్, కేటగిరిలో 18వ ర్యాంక్‌లు వచ్చాయి. ఇద్దరికి ఎస్జీజీ ఉద్యోగాలు వచ్చాయి. అదే విధంగా పేరాయిగూడేనికి చెందిన తగరం సూరయ్య కుమార్తె తగరం సునీత కూడా ఎస్జీటీ ఉద్యోగాన్ని సాధించింది. తండ్రి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.